క్లుప్తంగా

భక్తి గీతాలాపన



నెల్లూరు(బృందావనం): హనుమజ్జయంతిని పురస్కరించుకొని ఇస్కాన్ సిటీలోని హనుమాన్ జంక్షన్లో గల హనుమాన్ ఆలయంలో భజనలు, భక్తిగీతాలను శుక్రవారం ఆలపించారు. గోవిందరాజు సుభద్రాదేవి పర్యవేక్షించారు.

రేషన్ దుకాణంలో తనిఖీ



కొడవలూరు: స్థానిక ఐదో నంబర్ రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. తూకాల్లో వ్యత్యాసాలున్నాయా.. లేవాననే అంశంతో పాటు రిజిస్టర్లో నమోదైన నిల్వలు, వాస్తవ నిల్వలను పరిశీలించారు. కార్డుదారులతో మాట్లాడి సమస్యలను ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడారు. నిల్వల్లో ఎలాంటి వ్యత్యాసాల్లేవని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఆర్ఐ సునీల్‌రెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ రివిజన్ సర్వేకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న బాలకృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ట్యాక్స్ రివిజన్ సర్వేకు అధిక ప్రాధాన్యమివ్వాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, వార్డు అడ్మిన్ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను చేపట్టేందుకు కావాల్సిన నిధులను పన్నుల ద్వారా సేకరించిన మొత్తం నుంచే వెచ్చించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ క్రమంలో వార్డు అడ్మిన్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో రోజూ పర్యటించి పన్నుల సవరణ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 20 శాతం డిమాండ్‌ను అదనంగా పెంచాలని పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమావేశం



ఇందుకూరుపేట: గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరిదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలను సమన్వయంతో నిర్వహించి, విజయవంతం చేయాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్ కోరారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఈఓ తాతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. జూన్ రెండు నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నామని వివరించారు. కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఆధార్ కార్డును తప్పక తీసుకురావాలి



అభా నంబర్‌ను కేటాయిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: ప్రభుత్వాస్పత్రికి వచ్చే సమయంలో ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబర్‌ను విధిగా తీసుకురావాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) బీమా నంబర్‌ను పొందేందుకు గానూ వీటిని తప్పక తీసుకురావాలని కోరారు. ఈ నంబర్‌ను పొందిన వారు దేశంలో ఎక్కడైనా రూ.ఐదు లక్షల వరకు ఉచిత వైద్యాన్ని పొందొచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల బస్టాండ్

- కుక్కల స్వైరవిహారం
- బాత్‌రూమ్‌లకు తలుపులు కరువు
- పార్కింగ్‌కు పెద్దేదీ..?
- నిరుపయోగంగా ఫ్యాన్లు
- రాత్రయితే దోమల మోత



ఆర్టీసీ ప్రధాన బస్టాండ్

నెల్లూరు సిటీ: ప్రయాణికుల రాకపోకలతో నిత్యం సందడిగా ఉండే నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నగర జనాభా నానాటికీ పెరుగుతున్నా, ఇక్కడ వసతులు మెరుగుపడకపోగా, రోజురోజుకూ దిగజారుతున్నాయి. వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచి నిత్యం 25 వేల మందికిపైగా రాకపోకలు సాగిస్తున్నారు. కొత్త వారు బస్టాండ్ దుస్థితిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఇన్ని జరుగుతున్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది.

ఇవీ సమస్యలు..

⇨ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఫ్యాన్లు ఉన్నా, అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు.

⇨ ఇక్కడి కుర్చీల్లో రాత్రి వేళ పలువురు నిద్రపోతూ తోటివారికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ప్రశ్నిస్తే గొడవలకూ దిగుతున్నారు.

⇨ కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో, అవెక్కడ కరుస్తాయోననే ఆందోళన ప్రయాణికుల్లో నెలకొంటోంది.

⇨ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాత్‌రూమ్‌లకు తలుపుల్లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దుర్గంధంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతమవుతున్నాయి.

⇨ ఈ సమస్యలన్నీ ఓ ఎత్తయితే దోమల మోతతో రాత్రి వేళ భయానక పరిస్థితి తలెత్తుతోంది. ఇక్కడి కొచ్చి కొత్త రోగాలు కొని తెచ్చుకోవాల్సి వస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

⇨ ప్రాంగణంలో పార్కింగ్ వసతి అంతంతమాత్రంగా ఉంది. వాహనాల నుంచి పార్కింగ్ ఫీజులను వసూలు చేయడంలో చూపే శ్రద్ధ వాటి భద్రతలో ఏ మాత్రం చూపడంలేదు. నీడ కరువవడంతో ఇవి దెబ్బతింటున్నాయి. ఉన్నవి సరిపోకపోవడంతో ఆవరణలోనే పలువురు నిలిపేస్తున్నారు.



ఇదీ పార్కింగ్ దుస్థితి



తలుపుల్లేని మరుగుదొడ్లు

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ



తారక్



జైనుల్

నెల్లూరు (టౌన్): సైనిక్ స్కూల్ ఆలిండియా స్థాయిలో నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని గురుస్థాన్ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ మహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను నగరంలోని కోచింగ్ సెంటర్‌లో శుక్రవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. 300 మార్కులకు తారక్ 286, మహమ్మద్ జైనుల్ 266, సాయిచేతన్ 264, తలపనేని మోహిత్ 262, అమన్‌బాషా 251 మార్కులను సాధించారని చెప్పారు. ప్రిన్సిపల్ బీబీజాన్ పాల్గొన్నారు.

వీఆర్ స్కూల్ ఆధునికీకరణ పనుల పరిశీలన



నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు.
స్కూల్‌ను అద్భుతంగా ఆధునికీకరిస్తున్నారని కొనియాడారు.

పాటలు, డ్యాన్స్ పోటీలు రేపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో పాటలు, డ్యాన్స్ పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శుభమస్తు షాపింగ్‌మాల్ వ్యవస్థాపకుడు బయ్యా వెంకటరమణయ్య జయంతి సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. నాగిశెట్టి వెంకటరమణయ్య, రఘురామిరెడ్డి, మహేష్, అమానుల్లాఖాన్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. వీటిని గోపాల్‌రెడ్డి, ఖలీల్ బేగ్ పంపిణీ చేశారు. అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి గోపీనాథ్, రాజారమేష్, గఫార్, గణేష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమంచర్లలో గ్రామసభ



నెల్లూరు సిటీ: ఆమంచర్లలో గ్రామసభను ఆర్డీఓ అనూష ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏపీఐఐసీకి భూములను కేటాయించనున్నామని, దీని ద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. పరిశ్రమల స్థాపన కోసం 75 ఎకరాలను అందజేయనున్నామని వివరించారు. అనంతరం అంబాపురంలోని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



నెల్లూరు(బారకాసు): నగరంలోని 15వ డివిజన్లో పారిశుధ్య పనులను ఎంహెచ్‌ఓ చైతన్య శుక్రవారం పరిశీలించారు. సచివాలయంలో పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికను గమనించారు. అనంతతరం కాలువల పూడికతీత పనులను పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. నిత్య చండీ హోమం, రాహుకాల పూజలు, సహస్రనామార్చన, ఖడ్గమాల పూజ, లలితా సహస్రనామాన్ని జరిపారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, అమ్మవారికి పల్లకిసేవ నేత్రపర్వంగా నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఐటీఐలో జాబ్ మేళా నేడు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఏపీఎస్సెస్డీసీ, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత అర్హులని చెప్పారు. రెజ్యూమ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను తీసుకురావాలని, వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్యలకు పరిష్కారమేదీ..?

నెల్లూరు (టౌన్): గడిచిన కొన్ని నెలల్లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో ఉపాధ్యాయ సంఘాలు అనేక సమావేశాలను నిర్వహించినా, సమస్యలు పరిష్కారం కావడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర నేత మోహన్‌దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల తీరుతో ఉపాధ్యాయులకు మానసిక వ్యథ మిగులుతోందని చెప్పారు. బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించినా, అందులోని సాంకేతిక సమస్యలను పరిష్కరించలేదని పేర్కొన్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ ఉత్తమమన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులను చేపట్టనున్న క్రమంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామ్మూర్తినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామ్మూర్తినగర్, జేమ్స్‌గార్డెన్, రామలింగాపురం, బాలాజీనగర్, ఏసీనగర్ మెయిన్‌రోడ్డు, గౌడ హాస్టల్ సెంటర్, పూలే సెంటర్ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- కోటమిట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని జెండావీధి, కోటమిట్ట, గిడ్డంగివీధి, వీబీఎస్ కల్యాణ మండపం తదితర ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నిర్మాణ అనుమతులను పరిశీలించండి



సిమెంట్ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి భవన నిర్మాణ అనుమతులను పరిశీలించి.. అనధికార, అక్రమ కట్టడాల వివరాలపై నివేదికను అందజేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరంలోని 18, 19, 20వ డివిజన్లలో గల రామలింగాపురం, ముత్యాలపాళెం, గోమతినగర్, శ్రీహరినగర్, అరవిందనగర్, ఇస్కాన్ సిటీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. రీ సర్వే కార్యక్రమంలో భాగంగా తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి భవన నిర్మాణ అనుమతులు, అసెస్మెంట్ డిమాండ్, కుళాయి కనెక్షన్ తదితర వివరాలను పరిశీలించాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. ఇస్కాన్ సిటీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతను పర్యవేక్షించారు.

- టౌన్ ప్లానింగ్ విభాగ అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో పోస్టర్లు, ఫ్లెక్సీల్లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. షాపులు, దుకాణాలకు సంబంధించిన బోర్డులకు పన్నులను వసూలు చేయాలని పేర్కొన్నారు. సిటీ ప్లానర్ హిమబిందు, సూపరింటెండెంట్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.
- అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని అన్ని ప్రధాన పార్కుల్లో యోగాంధ్ర కార్యక్రమాలను వచ్చే నెల 21 వరకు నిర్వహించనున్నామని కమిషనర్ నందన్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ మాధురితో కలిసి ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని 15 ప్రధాన పార్కుల్లో ఉదయం ఆరు నుంచి ఏడు వరకు.. సాయంత్రం ఐదు నుంచి ఆరు వరకు యోగా గురువుల ఆధ్వర్యంలో శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కష్టపడే వారికి పార్టీలో పదవులు



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ పదవులు లభిస్తాయని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో 33, 34వ డివిజన్ల నేతలు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ స్థాయిలో అనుబంధ విభాగాల్లో ముఖ్య నేతలకు పదవులను ఇవ్వనున్నామని చెప్పారు. అనంతరం పార్టీ 33, 34వ డివిజన్ల ఇన్‌చార్జీలుగా అశోక్‌కుమార్, ఇలియాజ్‌ను నియమించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, బీసీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, అంగన్‌వాడీ విభాగ జిల్లా అధ్యక్షురాలు లావణ్య, కనకట్ల మోహన్‌రావు ముదిరాజ్, శారద, దాసరి రాజేష్, సతీష్, మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని సంతపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సునీల్, బన్నీ సాయిని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్ జయలక్ష్మి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, డివిజన్ల ఇన్‌చార్జీలు సందాని, మహేష్‌యాదవ్, మహబూబ్‌బాషా, నేతలు సింగంశెట్టి అశోక్, సుమధర్, ప్రసన్న, లోకేశ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం రేపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌ను స్థాపించి 13 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నాలుగు వైద్య విభాగాలతో చెన్నై హాస్పిటల్స్ పాలిక్లినిక్స్‌ను ప్రారంభించామని సెంటర్ అధినేత రమేష్‌బాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను క్లినిక్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సరస్వతీనగర్‌లోని తమ క్లినిక్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నామని వివరించారు. జనరల్ ఫిజీషియన్ శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వరి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని అందించరూ..



మేయర్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(బారకాసు): తాగేందుకు గుక్కెడు నీరు లేక అల్లాడుతున్నామని, సమస్యను పరిష్కరించండి మేయర్ మేడమ్ అంటూ మల్లాయగుంట వాసులు వేడుకున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ స్రవంతికి వినతిపత్రాన్ని ఆ ప్రాంతానికి చెందిన పలువురు, సీపీఎం నేత కోటేశ్వరరావుతో కలిసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మల్లాయగుంటలో గతంలో వేసిన రెండు బోర్లు పాడైపోయాయని, దీంతో నీరు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్‌నగర్‌కు మాత్రమే నీళ్ల ట్యాంకర్ వస్తోందని తెలిపారు. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. కాగా సమస్యను పరిష్కరించాలని మేయర్ సూచించారు. సీపీఎం నేతలు దశయ్య, ఆదెమ్మ, పోలమ్మ, రాజేష్, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెస్ శిక్షణ తరగతులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఎంజీబీ ఫెలిసిటీ మాల్లో ఆరు నుంచి 16 ఏళ్ల పిల్లలకు ఉచిత చెస్ శిక్షణ తరగతులను రోజూ సాయంత్రం ఆరు నుంచి 8.30 వరకు నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మాల్లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వివరాలకు 62815 80209 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మాల్ మేనేజర్ రాజశేఖర్, హెచ్ఆర్ అమూల్య, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ జగదీష్, ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ శిక్షకుడు మధుసూదన్‌రెడ్డి, సీనియర్ ఆర్బిటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.